సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం ◆ 25 ◆ సెప్టెంబర్ ◆ 2023



బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు
మోత్కూరు బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు, ఇబ్బందులు పడుతున్నారు. - 9లో



భక్తుల రద్దీ సాధారణం
గణేష్ ఉత్సవాల నేపథ్యంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. - 10లో



దేశం కంటే అమ్మ గొప్పది
దేశం కంటే అమ్మ గొప్పదని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. - 10లో

న్యూస్‌రీల్

26న చాకలి ఐలమ్మ జయంతి

భువనగిరిటౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని ఈనెల 26న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కుల సంఘాల నాయకులు, అధికారులు, అనధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వీరారెడ్డిపల్లి వాసికి అమ్మయాది పురస్కారం



అవార్డు అందుకుంటున్న పెసరు లింగారెడ్డి

తుర్కపల్లి : మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి పెసరు లింగారెడ్డికి గుండాల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన అమ్మయాది పెండెం ఫౌండేషన్ సాహిత్య పురస్కారం లభించింది. లింగారెడ్డి గత రెండు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారం దక్కింది. తెలంగాణ సాహిత్య పరిషత్ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, లోక కవి అందెశ్రీ, కవులు నాలేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు చేతుల మీదుగా ఆదివారం ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో పురస్కారం అందజేశారు. లింగారెడ్డికి అవార్డు రావడంతో యాదాద్రి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య, ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ, ప్రజాభారతి సాహిత్య సంస్థ అధ్యక్షుడు దేవినేని అరవింద్‌రాయుడు, బండి రాజులశంకర్, రాంప్రసాద్, మర్రి జయశ్రీ తదితరులు అభినందించారు.

మాతం ప్రదర్శన



మాతం ప్రదర్శన చేస్తున్న షియా ముస్లింలు

భువనగిరిటౌన్ : భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో మొహర్రం తుది వీడ్కోలు ధార్మిక సభ ఆదివారం స్థానిక ఖాజీ మోహిల్లాలోని షియా మసీద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా షియా ముస్లింలు మాతం ప్రదర్శన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మత గురువు శంస్ అబ్బాస్ నఖ్వీ ధార్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రజా హుస్సేన్, సయ్యద్ కల్బే హుస్సేన్, లాయక్ అలి, మహేది హుస్సేన్, తఖీ హుస్సేన్, హైదర్ అలీ, సజ్జాద్, అజ్గార్, అద్నాన్ రజా, బాసిత్ అలి తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలకు గణేష్ లడ్డూ కైవసం



లడ్డూతో సుర్కంటి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ : జాంబియా దేశంలోని లుసాక పట్టణంలో చౌటుప్పల్, పరిసర మండల వాసులు ప్రతిష్ఠించిన గణేష్ శోభాయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. ఆటాపాటలు, బ్యాండు మేళాలు, డీజేలతో శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా లడ్డూను వేలం నిర్వహించగా వ్యాపారవేత్త, హైడ్రోటిక్ డ్రిల్లింగ్ అండ్ ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ డైరెక్టర్ సుర్కంటి వెంకట్‌రెడ్డి రూ.20లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మద్ది జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సుష్మిత, ప్రహతి, రవీందర్‌రెడ్డి, మానస, శన్విత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రణీత, అశ్రిత్‌రెడ్డి, అర్పిత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఉత్సవ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్‌గా తిరుమలేష్

అడ్డగూడూరు : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్‌గా అడ్డగూడూరు మండల పరిధిలోని వెల్దేవి గ్రామానికి చెందిన బాసాని తిరుమలేష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, రాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోగులకు పరీక్ష!

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

- వేలిముద్రలు పడకపోవడంతో జాప్యం
- గంటల తరబడి నిరీక్షణ
- రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ
- ఈఓపీ కేంద్రాలు పెంచాలంటున్న రోగులు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద వివరాలు నమోదు చేయించుకునేందుకు నిరీక్షిస్తున్న రోగులు

భువనగిరి : ఆస్పత్రుల్లో రోగుల వివరాలు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఈఓపీ (ఎలక్ట్రానిక్ అవుట్ పేషెంట్) విధానం పేషెంట్‌లకు పరీక్ష పెడుతోంది. నూతన విధానం ప్రయోజనకరమే అయినప్పటికీ వేలిముద్రలు పడకపోవడంతో జాప్యం జరుగుతోంది. వెరసి రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఈఓపీ కేంద్రాలను పెంచాలని కోరుతున్నారు.

రోజూ 650 వరకు ఓపీ

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈఓపీ(ఎలక్ట్రానిక్ అవుట్ పేషెంట్)లో భాగంగా ప్రత్యేక యాప్ ద్వారా రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కాగా ఇటీవల జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తుండడంతో ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్ర ఆస్పత్రికి సాధారణంగా రోజూ 350 నుంచి 400 వరకు ఓపీ వస్తుండగా కొద్ది రోజులుగా 400 నుంచి 650 వరకు నమోదవుతోంది. సోమవారం, బుధవారం, గురువారం రోజుల్లో ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఆస్పత్రిలోని ఓపీ విభాగం వద్ద రోగులు తమ వివరాలు నమోదు చేసుకోవడానికి బారులుదీరుతున్నారు. ఈ సమయంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోగుల మధ్య తోపులాట చోటు చేసుకుంటుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు.

ప్రస్తుతం మూడు నమోదు కేంద్రాలు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ వివరాలను నమోదు చేసేందుకు ఈఓపీ ప్రక్రియలో భాగంగా మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో గైనకాలజీకి సంబంధించి ఒకటి, జనరల్ విభాగానికి రెండు కేద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్ ఓపీ విభాగానికి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈఓపీ ప్రక్రియలో భాగంగా రోగి వివరాల నమోదుతో పాటు అతని వేలిముద్రలు తప్పనిసరిగా వేయవల్సి ఉంటుంది. అయితే కొంతమంది రోగుల వేలిముద్రలు పడకపోవడంతో వివరాల నమోదులో జాప్యం ఏర్పడుతుంది. రోగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.



రోగుల వివరాలు ఈఓపీలో నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

రోగుల సంఖ్యకు అనుగుణంగా ఈఓపీ కేంద్రాలు పెంచాలని రోగులు కోరుతున్నారు.

కేంద్రాలు పెంచుతాం



జిల్లా కేంద్ర ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగింది. ఈఓపీ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత ఓపీ విభాగాలతో పాటు అత్యవసర విభాగంలో కూడా ఏర్పాటు చేశాం. సోమ, బుధ, గురువారం రోజుల్లో ఓపీ ఎక్కువగా ఉంటుంది. వీరిని దృష్టిలో పెట్టుకుని మరో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో వేగంగా నమోదు చేయడానికి నూతన విధానం దోహదపడుతుంది. చిన్నచిన్న లోపాలు ఉంటే సర్దుకుంటాయి. –చిన్నానాయక్, డీసీహెచ్‌ఎస్, జిల్లా కేంద్ర ఆస్పత్రి

మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్ ఇన్

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యపై సోమవారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయిన్‌లు, చెత్త పేరుకుపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు నిల్వ ఉండడం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేది. 25.09.2023 సోమవారం
మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు
డయల్ చేయాల్సిన నంబర్ : 9394749205



కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

కాంగ్రెస్‌వి స్పష్టత లేని స్కీంలు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) : కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ఆ పార్టీకే స్పష్టత లేదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రండామె విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. అమలుకు సాధ్యం కాని ఆరు గ్యారంటీ స్కీంల పేరుతో మరోసారి ముందుకొస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది సోనియాగాంధీయేనని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు.. డిసెంబర్ 9న ఎందుకు యూటర్న్ తీసుకున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సుదీర్ఘ పోరాటం, దీక్షలు, యువకుల బలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. మహిళలంటే కాంగ్రెస్‌కు ఏమాత్రం గౌరవం లేదన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ అవుతుంటే కాంగ్రెస్ ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముగ్గురు సభలో ఉండకుండా వెళ్లిపోయారని, వారికి మహిళల పట్ల గౌరవం లేదని తేలిపోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో మూడవ సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో కూడా లేవన్నారు. పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. అనంతరం పల్లెర్లలో బీఆర్‌ఎస్ నాయకుడు నిమ్మరెడ్డి వెంకట్‌రెడ్డి సతీమణి దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకులు బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, యాస ఇంద్రారెడ్డి, ఎంపీటీసీ యాస కవిత, నాయకులు కోరె భిక్షపతి, సోలిపురం అరుణ, కోరె వెంకన్న ఉన్నారు.

ఆరు గ్యారంటీలు.. ఎన్నికల గిమ్మిక్కులే

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు : కాంగ్రెస్ పార్టీవి ఆచరణకు సాధ్యం కాని హామీలని, ఆరు గ్యారంటీ స్కీంలు ఎన్నికల గిమ్మిక్కులేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను మొదట ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. అధికార దాహంతో ఆచరణకు నోచుకోని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతుందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని, రానున్న ఎన్నికల్లోనూ ఆ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. బీసీ బంధు, దళితబంధు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం దశలవారీగా అర్హులకు అందిస్తుందన్నారు. త్వరలో ఎస్టీ బంధు ప్రవేశపెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. గొర్రెల యూనిట్ నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలు ఆగిపోకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ అధికారంలో రావాలన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదింపజేసిన బీజేపీ.. చట్టం తీసుకురావడంలో జాప్యం చేయడం తగదన్నారు. బిల్లుకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, అడ్డగూడూరు ఎంపీపీ దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీరాముల జ్యోతి, మోత్కూరు, అడ్డగూడూరు సింగిల్‌విండోల చైర్మన్లు కె.అశోక్‌రెడ్డి, పొన్నాల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు కొణతం యాకూబ్‌రెడ్డి, మేఘారెడ్డి, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్ దాసరి తిరుమలేష్, పట్టణ అధ్యక్షులు కళ్యాణ్‌చక్రవర్తి, కార్యదర్శి గజ్జి మల్లేషం, నాయకులు కందుల విక్రాంత్, కోమటి మత్స్యగిరి, ఎండీ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం శ్రీస్వామివారికి ఆరాధన, నిజాభిషేకం, అర్చనలు గావించారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి



యాదగిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌టీయూ నాయకులు

- బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

యాదగిరిగుట్ట : తెలంగాణకు కేసీఆరే రక్ష అని, ఆయన పాలనలోనే కార్మిక వర్గాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం జరిగిన బీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కొన్ని కార్మిక సంఘాలు అకారణంగా సాధ్యం కాని డిమాండ్లను తెరపైకి తెచ్చి కార్మికులను సమ్మెలోకి దించుతున్నాయని, దీన్ని బీఆర్‌టీయూ ఖండిస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని, సమ్మెలు, ఆందోళనలతో పరిష్కారం కావన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న తీరు, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బీఆర్‌టీయూ నాయకులు ప్రజల్లో క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీఆర్‌టీయూతో పాటు 46 అనుబంధ రంగాల కార్మిక సంఘాలు కేసీఆర్‌ను మూడవసారి సీఎంను చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు యాదగిరి గుట్ట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఆటో కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది దేవేందర్ గౌడ్, రూప్‌సింగ్, నారాయణ, అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కలవర పెడుతున్న కొండచిలువలు



కక్కిరేణి శివారులో గొర్రె పిల్లను తింటున్న కొండచిలువ

- ఆసిఫ్‌నహర్ కాలువ పరిసరాల్లో పెరుగుతున్న సంతతి
- మూగజీవాల ప్రాణాలకు ముప్పు
- భయాందోళనలో రైతులు

రామన్నపేట : మండలంలోని ఆసిఫ్‌నహర్ కాలువ పరిసరాల్లో కొండచిలువల సంతతి పెరుగుతోంది. కాలువ వెంట గల పొదలను స్థావరాలుగా చేసుకొని జీవాలను చంపి తింటున్నాయి. దీంతో రైతులు పొలం పనులకు వెళ్లాలన్నా, పశువులు, గొర్రెల, మేకలను మేతకు తోలుకెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు.

వలిగొండ మండలం నెమలికాలువ వద్ద మూసీ నదికి అడ్డంగా నిర్మించిన డిస్ట్రిబ్యూటరీ నుంచి ఆసిఫ్‌నహర్ కాలువ ప్రారంభం అవుతుంది. 397 క్యూసెక్కుల సామర్థ్యంతో కూడిన ఆసిఫ్‌నహర్ కాలువ రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాల పరిధిలో ప్రవహిస్తోంది. ఈ కాల్వ ద్వారా సుమారు 15,245 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాగా గత కొన్ని సంవత్సరాలుగా కాలువ నిర్వహణ కొరవడింది. దీంతో కాలువ ఇరువైపులా దట్టమైన కంపచెట్లు, గుర్రపు డెక్కతో నిండిపోయింది. ముళ్లపొదలు, గుర్రపు డెక్క కొండచిలువలకు స్థావరాలుగా మారాయి. కాలువ వెంట మేతకు వచ్చిన జీవాలపై కొండచిలువలు దాడిచేసి చంపుతున్నాయి. కక్కిరేణి శివారులో సాగర్ల మల్లయ్యకు చెందిన గొర్రె పిల్ల ను ఇటీవల పట్టి చంపడాన్ని గ్రామస్తులు ప్రత్యక్షంగా చూశారు. ఇటువంటి ఘటనలు మరికొన్ని చోటు చేసుకున్నాయి. కక్కిరేణిలో పోతరాయి చెరువు పరిసరాల్లోనూ కొండచిలువల సంచారం పెరిగిందని స్థానిక రైతులు చెబుతున్నారు. కాలువ వెంట మూగజీవాలను మేతకు తోలుకెళ్లే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. నీటి పారుదల శాఖ, అటవీ శాఖల అధికారులు స్పందించి కొండచిలువలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొర్రె పిల్లను చంపుతుంటే చూశాను



నాలుగు రోజుల క్రితం జీవాలను మేపుకొని కాలువకట్ట వెంట ఇంటికి వస్తుండగా గొర్రెపిల్ల అరుపులు వినిపించాయి. అటువైపు వెళ్లిచూడగా కొండచిలువ గొర్రెపిల్లను పట్టింది. భయంతో అక్కడున్న కాపరులను పిలిచాను. కొండచిలువల భారినుంచి కాపాడాలి. – సాగర్ల మల్లయ్య, గొర్రెల పెంపకం దారుడు, కక్కిరేణి

చౌటుప్పల్ రోడ్లకు కొత్త రూపు

- అంతర్గత రహదారులకు సీసీ కళ
- రూ.45 కోట్లతో నిర్మాణం
- చాలా చోట్ల పూర్తయిన పనులు
- తీరనున్న సమస్య





చౌటుప్పల్‌లోని రత్నానగర్, విద్యానగర్ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్లు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.45 కోట్లతో చేపట్టిన పనులు చాలా చోట్ల పూర్తయ్యాయి. దశాబ్దాలుగా మట్టి, బురదతో దర్శనమిచ్చిన అంతర్గత రోడ్లు సీసీగా మారుతుండడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్లు నిర్మిస్తున్న ప్రాంతాలివే..

మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు నుంచే పట్టణంలో చాలా కాలనీల్లో సీసీ రోడ్లు లేవు. ఇటీవల మంజూరైన నిధులతో అధ్వానంగా ఉన్న రోడ్లన్నీ నూతన శోభను సంతరించుకుంటున్నాయి. మల్లికార్జుననగర్, శివాజీనగర్, బీసీ కాలనీ, హైస్కూల్ ఎదురుగా, మార్కండేయనగర్, విద్యానగర్, శాంతినగర్, రాంనగర్, కంచరకుంట్ల కాలనీ, చైతన్యనగర్, గణేష్‌నగర్, మల్లికార్జునస్కూల్ ఏరియా, కమహేశ్వర దేవాలయం, బంగారిగడ్డ, రత్నానగర్, హనుమాన్‌నగర్, చెరువుకట్ట కిందిభాగం, హ్యాండ్లూమ్ మార్కెట్ ఏరియాల్లో అంతర్గత వీధులన్నీ సీసీతో మెరిసిపోతున్నాయి. అక్కడక్కడా మిగిలిన కొద్దిపాటి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్యే చొరవతో..

మున్సిపాలిటీగా ఏర్పాటుకు ముందు పట్టణంలో కొంతమేరకే సిమెంట్ రోడ్లు ఉండేవి. మున్సిపాలిటీ అయినా అంతర్గత రోడ్లు పెద్దగా అభివృద్ధి చెందలేదు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత అంతర్గత రోడ్లపై స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్‌శాఖ, ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులతో చేపట్టవలసిన పనుల విషయమై ప్రజలతో ప్రత్యేకంగా చర్చించారు. వారి అవసరాల మేరకు ముందుగా డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని నిర్ణయించారు. కాలనీల్లో పలుమార్లు పర్యటించి సమస్యలను గుర్తించారు. యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న పనులపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ జాప్యం జరగకుండా చూస్తున్నారు.

వీధులు అందంగా మారాయి



పట్టణంలోని అంతర్గత రోడ్లు చాలా వరకు సీసీగా మారాయి. సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పట్టణం నూతన శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాల సమస్య నుంచి విముక్తి లభించనుంది. – దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, విద్యానగర్ కాలనీ

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే లక్ష్యం. అందులో భాగంగానే వివిధ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పలుమార్లు పర్యటించిన అనంతరం ప్రజల అవసరాలను గుర్తించాం. వారి సూచనలు పరిగణలోకి తీసుకొని ఆ ప్రకారం ప్రణాళికలు రూపొందించి సీసీరోడ్లు, డ్రెయినేజీలు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మిస్తున్నాం. నిధుల సమస్య లేదు. అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడి ఇంకా నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేస్తా. – కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మునుగోడు

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లి కారు బోల్తా


హైవే వెంట పొలాల్లో బోల్తాపడిన కారు

అర్వపల్లి: నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి జాజిరెడ్డిగూడెం మీదుగా మద్దిరాలకు వెళ్తున్న కారు అర్వపల్లి శివారులో అదుపుతప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి వాహనంలో నుంచి దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బోల్తా పడిన కారును స్థానికులు ట్రాక్టర్‌తో బయటికి తీశారు. 365, 365బీ హైవేలపై తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవా లని పలువురు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు : పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అడ్డగూగూరు మండలంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుండాల మండలం బండ కొత్తపల్లి గ్రామానికి చెందిన ననుబాల యాదగిరి కూతురు మంజుల(32)కు అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన ననూబోతు మహేష్‌తో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. బండ కొత్తపల్లికి చెందిన మంజుల తమ్ముడు భిక్షంకు జానకీపురం గ్రామానికి చెందిన అనూషతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. మహేష్, మంజుల మధ్యవర్తిత్వం వహించి వీరి వివాహం జరిపించారు. అయితే, కొంత కాలంగా భిక్షం, అనూష దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో అనూష పుట్టింటికి వచ్చింది. అనూష కుటుంబ సభ్యులు భిక్షం తీరుపై మహేష్, మంజులను నిలదీశారు. భిక్షం వైఖరి కారణంగా మహేష్, మంజుల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మంజుల శనివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న మంజులను కొద్ది సేపటి తర్వాత భర్త గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు అభినందనీయం

భువనగిరి: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ అన్నారు. చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు వైద్యం కార్యక్రమంలో భాగంగా 100వ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణ శివారులోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వైద్యరంగానికి 1.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా.. అభివృద్ధి చెందిన దేశాల్లో 10 శాతం ఖర్చు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు వైద్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తే వైద్య రంగంలో మంచి ఫలితాలు సాధించవచ్చొన్నారు. కార్యక్రమంలో చావా ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు డాక్టర్ తిరునగరి రంగయ్య, విజయ్‌భార్గవ్, సద్ది వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ, బండారు రాంమోహన్‌రావు, జడ్డి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రహస్యంగా మృతదేహం పూడ్చివేత

మృతదేహాన్ని బ్యాగులో కుక్కి.. కారులో తీసుకొచ్చి..

- అర్ధరాత్రి నల్లగొండ శివారు ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువభాగాన అంతిమ సంస్కారాలు
- గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేయడంపై అనుమానాలు


మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశం

నల్లగొండ క్రైం : దుండగులు అర్ధరాత్రి ఓ మృతదేహానికి రహస్యంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన నీలగిరి మున్సిపాలిటీ పరిధి చందనపల్లి శివారు చెత్త డంపింగ్ యార్డు సమీపంలో పానగల్ ఉదయ సముద్రం ఎగువ ప్రాంతంలో జరిగింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి 11:30 గంటలకు కారులో నలుగురు, మూడు బైక్‌లపై మరో ఆరుగురు వ్యక్తులు చందనపల్లి చెత్తడంపింగ్ యార్డు సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువ ప్రాంతానికి వచ్చారు. వాహనాలను అక్కడే నిలిపి తమ వెంట తెచ్చుకున్న పలుగు, పారలతో సుమారు 4 నుంచి 5 ఫీట్ల పొడవులో గొయ్యి తీశారు. ప్యాకెట్లలో తీసుకొచ్చిన ఉప్పు గొయ్యిలో పోశారు. అనంతరం బ్యాగులో కుక్కి కారులో తీసుకొచ్చిన మృతదేహాన్ని బయటికి తీశారు. ఇద్దరు వ్యక్తులు సదరు మృతదేహం కాళ్లు ఒకరు, చేతులు మరొకరు పట్టుకుని గోతిలో పెట్టి పూడ్చిపెట్టారు. ఈ క్రమంలో వెంట వచ్చిన ఒకరు పెద్ద పెట్టున రోదించగా మిగతా వారు అతడిని వారించారు. అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత అందరూ ఆయా వాహనాల్లో అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిసింది.

ఆ.. మృతదేహం ఎవరిది?

గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేసిన మృతదేహం ఎవరిదనేది చందనపల్లి గ్రామంలో చర్చ జరుగుతోంది. గొయ్యి పొడవు 4 నుంచి 5 ఫీట్ల లోపే ఉండడంతో ఆ మృతదేహం 6 నుంచి ఏడేళ్ల లోపు వారిదే ఉంటుందని తెలుస్తోంది. మృతదేహం ఆడ, మగ అనేది స్పష్టత లేదని అర్ధరాత్రి చాటుగా గమనించిన వారు పేర్కొంటున్నారు. ఏదైనా అనారోగ్యంతో మృతిచెందితే నిర్భయంగా అంత్యక్రియలు చేస్తారు. మహిళలు ఎవరు లేకుండా, అర్ధరాత్రి బ్యాగులో మృతదేహాన్ని తీసుకొచ్చి ఖననం చేయడంతో ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి పూడ్చిపెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం అష్టమి కావడంతో నరబలి ఇచ్చిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారనే అనుమానాలు లేకపోలేదు. అర్ధరాత్రి అంతిమ సంస్కారాల తంతును గమనించిన కొందరు చందనపల్లి గ్రామస్తులకు విషయం తెలపడంతో చర్చనీయాంశంగా మారింది.

ఆదర్శ యువజన మండలి ఆధ్వర్యంలో..

- మాసాయిపేటలో 48ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు


మాసాయిపేటలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఆదర్శ యువజన మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో 48 ఏళ్ల నుంచి గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1975 సంవత్సరంలో 400 మందితో సుభాష్ యూత్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1998లో ఆదర్శ యువజన మండలిగా పేరు మార్చారు. గ్రామంలో ఒక్కటే వినాయకుని మండపం ఉండడంతో అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకునేవారు. 2000 సంవత్సరంలో కొంత మంది వేరుకావడంతో ప్రస్తుతం 200మంది సభ్యులతో ఆదర్శ యువజన మండలి ముందుకు కొనసాగుతోంది.

సేవా కార్యక్రమాలు

మాసాయిపేట గ్రామంలో 1990కి ముందు వినాయకుని మండపం వద్ద నాటకాలు వేయించేవారు. అదేవిధంగా పిల్లలకు ప్రత్యేకమైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. దీంతో పాటు గ్రామంలో క్లబ్ తరఫున సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పాఠశాలలో కావాల్సిన వసతులు తెలుసుకుని సహాయం చేసేవారు.

సేవా కార్యక్రమాలు చేస్తాం



ఆదర్శ యువజన మండలి యూత్ తరఫున సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. 2000 –05 వరకు అధ్యక్షుడిగా పనిచేసాను. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవాల కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాం.

– ఇరిటిపు శ్రీనివాస్, యూత్ కన్వీనర్

ఆదర్శంగా ఉంటాం



మా యూత్ ద్వారా వినాయక మండపాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తూ, ఇతరులకు ఆదర్శంగా ఉంటున్నాం. అందరికంటే భిన్నంగా, కల్చరల్, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతాము. గ్రామస్తుల నుంచి సహకారం లభిస్తుంది.

– కటకం శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు

పీఏపల్లిలో పట్టపగలే చోరీ

- రూ.5లక్షల నగదు, 5తులాల బంగారం అపహరణ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ గిరిబాబు

పెద్దఅడిశర్లపల్లి: పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.5లక్షల నగదుతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పీఏపల్లికి చెందిన వంగాల లక్ష్మారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మారెడ్డి తన బంధువులను పరామర్శించేందుకు ఆదివారం ఉదయం 9గంటలకు ఇంటికి తాళం వేసి తన భార్యతో కలసి నేరేడుచర్లకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. లక్ష్మారెడ్డి తన కుమారుడి విదేశీ విద్య నిమిత్తం బీరువాలో దాచిన రూ.5లక్షలతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి


బుద్ధుని పాదాల చెంత పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధులు

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులతోపాటు మహారాష్ట్రలోని పూణే నుంచి బౌద్ధులు వచ్చారు. వీరు బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. జాతక కథల పార్కు, స్తూపపార్కు, శ్రీలంక దేశీయులు ఏర్పాటు చేసిన 40 అడుగుల బుద్ధుడు, తపోవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్తూ పంపై చెక్కిన శిల్పాలను, మహాస్తూపం రెండవ అంతస్తులో గల అష్ట బుద్ధులను సందర్శించారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోగల బుద్ధుడి చరిత్రకు సంబంధించిన విగ్రహాలతో పాటు చైత్యాలు, మహాబోధి వృక్షం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరికి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధుని గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


రవీందర్ (ఫైల్)

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన కర్ణకంటి రవీందర్(50) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామంలో శనివారం కార్పెంటర్ పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకుని భువనగిరికి వచ్చేందుకు పగిడిపల్లిలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యం వాహనంతో పోలీసులు

నాగారం : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం ఫణిగిరి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని చందులాల్ తండాకు చెందిన దేవుసోత్ రెడ్యా, పచ్చలబోడు తండాకు చెందిన గుగులోతు అనిల్ నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని టాటాఏస్ వాహనంలో హైదరాబాద్ వైపు తరలిస్తుండగా ఫణిగిరి స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని, టాటాఏస్ వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు సరికాదు


సమ్మెకు మద్దతు పలికి మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ రెడ్డి

మునుగోడు, చండూరు: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పోరాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోగా.. వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు, చండూరులో అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. స్వచ్ఛంద సేవకుల్లా ఎన్నో రకాల పనులు చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాల డిమాండ్ చేశారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నలపరాజు సతీష్‌కుమార్, చాపల శీను, దొటి వెంకన్న, బండమీది వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు కేదారి, సునీత, రాధిక, రాజేశ్వరి, శోభ, తారక, జోతి, జగదీశ్వరి, నాగమణి, రమణమ్మ, శారద, జంగమ్మ, పార్వతమ్మ, ఉష, వనజ, అన్నపూర్ణ, లలిత, రాధిక, పారిజాత, ప్రమీల, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధం

- రూ.75 లక్షల ఆస్తినష్టం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధమైంది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బీబీగూడెం శివారులోని అక్షిత ట్రేడర్స్ కూల్‌డ్రింక్స్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు సూర్యాపేటలో ఉంటున్న యాజమాని జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. విషయం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు చల్లార్చారు. అప్పటికే గోదాములో ఉన్న కూల్‌డ్రింక్స్‌తో పాటు గోదాము దగ్ధమైందని యాజమాని తెలిపాడు. ఈ ప్రమాదంలో రూ.75 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు వాపోయాడు. గోదాం యాజమాని జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం

- విద్యుదాఘాతంతో ఏడేళ్ల బాలుడు మృతి
- తుర్కపల్లి మండల పరిధిలో ఘటన


ఆదిత్య మృతదేహం

తుర్కపల్లి: గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. ఏకదంతుడికి పూజలు నిర్వహించేందుకు తల్లిదండ్రులతో కలసి వెళ్లిన ఏడేళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం దత్తాయపల్లికి చెందిన జిట్టా రాజు, మహాలక్ష్మీ దంపతులు తమ కుమారుడు ఆదిత్య (7), కూతురితో కలసి గ్రామంలో ప్రతిష్ఠించిన గణేశ్ విగ్రహానికి పూజలు నిర్వహించేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. తల్లిదండ్రులు మండపం వద్ద ఉండగా ఆదిత్య, దాని ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లాడు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఇనుపచువ్వలు పట్టుకుని ఎక్కేందుకు ప్రయత్నించాడు. అప్పటికే ఆ ఇనుపచువ్వలకు గణేశ్ మండపానికి విద్యుత్ సరఫరా అవుతున్న వైరు తగిలి ఉంది. ఆదిత్య ఆ చువ్వలను పట్టుకోగానే విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదిత్య మృతితో దత్తాయపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది.

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

- కేటీఆర్‌కు వైఎస్సార్‌టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జేవీఆర్ వినతి


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేవీఆర్

హుజూర్‌నగర్: నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని వైఎస్సార్ టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం, వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ చివరి ప్రాంతంలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతుల పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. రైతులు నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నందున సాగు, తాగు నీటిని అందించాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద ఉన్న అసంపూర్తి ఇళ్లను వెంటనే పూర్తి చేయించి అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. వీటిపై మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు జేవీఆర్ వివరించారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ


గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

బీబీనగర్: మండల పరిధిలోని హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ఈ రహదారి గుండానే వెళ్తుండడంతో గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. ఉదయం, సాయంత్రం వేళ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): హైదరాబాద్ దోబీఘాట్‌లో అక్టోబర్ 4న జరగనున్న ఉప కులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఉప కులాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గద్దం యాదగిరి కోరారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ వద్ద సభ పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉప కులాలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియుద్దీన్, ఎస్టీ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్, ముంతాజ్ అలీ, రంగాపూరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన అడ్డంకులను తొలగించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య


సూర్యాపేటటౌన్: కవిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య డిమాండ్ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జలగం కవిత కుటుంబానికి ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం కుటుంబ సంక్షేమ నిధి ద్వారా రూ.6లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీజోన్–2 బదిలీలు, పదోన్నతుల విషయంలో ఏర్పడిన న్యాయపరమైన అడ్డంకులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, ఎం. వెంకన్న, సీహెచ్. రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, కొండయ్య, ఎస్. మహేష్, సోమయ్య, అనిల్‌కుమార్, యాకయ్య, అరుణభారతి, వెంకటయ్య, పాపిరెడ్డి, రమేష ఆడం తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

కోదాడరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మచ్చ రామకృష్ణ సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేసేందుకు నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో 22వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 5086 ఖాళీలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.6లక్షల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎం. రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి నాగమణి, జిల్లా అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కేపీ. మంగ, పి. శ్రీనివాసరెడ్డి, ఆర్. ధనమూర్తి, కొండయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.

వరిలో ఆకు ఎండు తెగులు

- రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు


డాక్టర్ శ్రీనివాసరావు


త్రిపురారం : ఆకు ఎండు తెగులు సోకిన వరి పొలం



త్రిపురారం : ఉమ్మడి జిల్లాలో బోర్లు, బావులు, ఇతర సాగు నీటి వనరుల ద్వార సాగు చేసిన వరి పంటకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బ్యాక్టీరియా సోకడంతో ఆకు ఎండు తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు రైతులు తక్షణమే యాజ మాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగాం కోఆర్డి నేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

తెగులు సోకడానికి కారణాలు

సెప్టెంబర్–అక్టోబర్ నెలలో మబ్బులతో కూడిన వాతావరణం, రెండు నుంచి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు తదితర పరిస్థితులు వరిలో ఆకు ఎండు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఆకు ఎండు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తుంది.

తెగులును గుర్తించే విధానం

వరి పంటలో ఆకు ఎండు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయకూడదు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు (లేదా) పోషామైసిన్ (లేదా) స్ట్రెప్టోసైక్లిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.